సాక్షి
విశాఖపట్నం
గురువారం । 15 । జూన్ । 2023


సకాలంలో విద్యా కానుక
విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో అందించేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. 4లో


బుల్లెట్ వేగంతో గమ్యం వైపు
తెలుగు రాష్ట్రాల్ని కలుపుతూ అత్యాధునిక సెమీ హై స్పీడ్ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 4లో


నేటి నుంచి యోగా వారోత్సవాలు
యోగా వారోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు తెలిపారు. 4లో

న్యూస్‌రీల్

తూర్పు నౌకాదళాధిపతితో పోర్టు చైర్మన్ భేటీ


పోర్టు చైర్మన్ డా.అంగముత్తుకు జ్ఞాపిక అందిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్‌అడ్మిరల్ గుప్తా

సాక్షి, విశాఖపట్నం : తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తాతో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) చైర్మన్ డా.మధ్యయన్ అంగముత్తు బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయంలో ఇరువురూ సమావేశమై.. భవిష్యత్తులో తూర్పు నౌకాదళం, వీపీఏ సంయుక్తంగా నిర్వహించనున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఇటీవల పోర్టులో నిర్వహిస్తున్న పలు ప్రాజెక్టులు, నేవల్ అవుటర్ హార్బర్ ప్రాజెక్టు, ఐఎన్ఎస్ విక్రాంత్‌కు బెర్తింగ్ తదితర అంశాల గురించి వివరించారు.

ఐటీఐ కౌన్సెలింగ్ ప్రారంభం


అర్హత పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ రాణి సుష్మిత, కన్వీనర్ శ్రీకాంత్

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌ను డిప్యూటీ కలెక్టర్ రాణి సుష్మిత, ఉపాధి, శిక్షణ శాఖ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్‌లో 1 నుంచి 515 ర్యాంక్ అభ్యర్థులకు పాల్గొంటే 290 మంది అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐల్లో అర్హత సాధించారు. రెండో ర్యాంక్ సాధించిన వి.దినేష్‌కుమార్‌కి ఎలక్ట్రీషన్ ట్రేడ్‌లో అర్హత పత్రాన్ని అధికారులు అందజేశారు. గురువారం జరిగే కౌన్సెలింగ్‌కు 516 నుంచి 1,206 ర్యాంక్ అభ్యర్థులు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

సాంఘిక సంక్షేమశాఖ డీడీగా రామారావు బాధ్యతల స్వీకరణ


రామారావుకు అభినందనలు తెలియజేస్తున్న శాఖ ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కె.రామారావు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఆయన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఆ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా, ఇన్‌చార్జి డీడీగా వ్యవహరించిన రమణమూర్తి కాకినాడకు బదిలీపై వెళ్లడంతో డీడీగా రామారావును నియమించారు. దీంతో పాటు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా రామారావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఆయన ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ భవనంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ, ఎస్సీ కార్పొరేషన్ విభాగ ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలకడంతో పాటు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శంకర్‌రావు, భాస్కర్‌తో పలువురు పాల్గొన్నారు.

ఆర్ఐవోగా సత్యనారాయణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్ఐవో)గా రాయల సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. జిల్లా వృత్తి విద్యాధికారిగా పని చేస్తున్న సత్యనారాయణకు ఆర్ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎం.వి.శేషగిరి బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం భీమునిపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న పి.ఉమారాణి ఆర్ఐవోగా వ్యవహరిస్తున్నారు. సత్యనారాయణ నియామకంతో ఆమె తిరిగి తన మాతృస్థానానికి వెళ్లారు. ఉన్నతాధికారుల సహకారం, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జిల్లా అధికారుల సూచనలతో ఇంటర్మీడియట్ విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు. ఆర్ఐవోగా బాధ్యతలు తీసుకున్న ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

మెరిసిన మనోళ్లు

ఏపీ ఈఏపీ సెట్‌లో విశాఖ విద్యార్థుల సత్తా

ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు మెరిశారు. ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఇందులో ర్యాంకులు పొందిన వారిలో చాలా మంది జేఈఈ మెయిన్స్, నీట్‌లో కూడా ఉత్తమ ఫలితాలు సాధించారు. పలువురు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇందులో కూడా ర్యాంక్ సాధించి దేశంలో ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీల్లో చేరుతామని స్పష్టం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్, విశాఖపట్నం

రిషితకు 179వ ర్యాంకు



అక్కిరెడ్డిపాలెం వద్ద గల సంచవటీలో నివాసం ఉంటున్న శీరం రిషిత ఏపీ ఈఏపీ సెట్‌లో 179 ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి శీరం పైడిరాజు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తల్లి సునీత జైళ్ల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వ్యవసాయ రంగంలో మంచి శాస్త్రవేత్తగా ఎదగాలన్నదే తన లక్ష్యమని రిషిత వెల్లడించింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



నాకు ఏపీ ఈఏపీ సెట్‌లో 22వ ర్యాంకు వచ్చింది. నీట్‌లో జాతీయ స్థాయిలో 812వ ర్యాంకు సాధించాను. శ్రీ విశ్వ కళాశాలలో చదివాను. జిప్‌మర్/ఏఎంసీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి.. పిడియాట్రిషన్ లేదా రేడియాలజిస్టు పీజీ చేయాలన్నదే నా లక్ష్యం. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల శిక్షణ వల్ల మంచి ర్యాంకులు సాధించగలిగాను. – సాయిరుషిత, ఎస్‌వీడీ గౌరీనగర్

ఉక్కు విద్యార్థికి 178వ ర్యాంకు



స్టీల్‌ప్లాంట్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం డీజీఎం కె.ముత్తు కుమార్, తిలక దంపతుల కుమారుడు నితిల్ కెవిన్‌కు ఏపీ ఈఏపీ సెట్‌లో 178వ ర్యాంకు వచ్చింది. ఫిట్జీలో ఇంటర్ చదివిన నితిల్ మొదటి ప్రయత్నంలో ఈ ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 540వ ర్యాంకు సాధించి అక్కడ సీటును దక్కించుకున్నాడు. వచ్చే వారం రానున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల కోసం ఎదురు చేస్తున్నాడు. ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌లో కంప్యూటర్ సైన్స్ చేయడం తన లక్ష్యమని నితిల్ తెలిపాడు.

ముంబయి ఐఐటీలో చదువుతా...



ముంబయి ఐఐటీలో కంప్యూటర్ కోర్సు పూర్తి చేయాలన్నదే నా లక్ష్యం. మాది ప్రకాశం జిల్లా చీరాల. నాన్న వెంకట రామయ్య డీవీస్‌లో ఉద్యోగి. ప్రస్తుతం సంగివలసలో ఉంటున్నాం. తాళ్లవలస తిరుమల విద్యా సంస్థల్లో 10వ తరగతిలో 600కు 600 మార్కులతో, ఇంటర్మీడియట్‌లో 986 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాను. జేఈఈ అడ్వాన్స్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాను. ఈఏపీ సెట్‌లో 148వ ర్యాంకు లభించింది. కంప్యూటర్ ఇంజినీర్‌గా స్థిరపడతా.

– పాలేరు యశ్వంత్ శ్రీనివాస్, సంగివలస

డాక్టర్‌గా స్థిరపడతా..



ఏపీ ఈఏపీ సెట్‌లో 224వ ర్యాంకు సాధించాను. నాన్న కృష్ణ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. అమ్మ పుష్ప గృహిణి. ఇంటర్మీడియట్ విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పూర్తి చేశాను. 6 నుంచి 8వ తరగతి వరకు కొమ్మాది నవోదయ విద్యాలయంలో, పెందుర్తిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9, 10 తరగతులు చదివాను. తెలంగాణ ఎంసెట్‌లో 192వ ర్యాంకు, నీట్‌లో ఓబీసీ కేటగిరీలో 608వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 2,114వ ర్యాంకు సాధించాను. ఎయిమ్స్ లేదా జిప్‌మర్‌లో ఎంబీబీఎస్ చేసి డాక్టర్‌గా స్థిరపడాలన్నదే నా లక్ష్యం. – గొర్లి కుందన, గొర్లివానిపాలెం, సబ్బవరం మండలం

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడతా..



ఏపీ ఈఏపీ సెట్‌లో 66వ ర్యాంకు సాధించాను. విజయవాడ శ్రీచైతన్యలో ఇంటర్ చదివి 960 మార్కులు సాధించాను. నాన్న సత్యనారాయణ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. అమ్మ కృష్ణవేణి గృహిణి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడతా..

– కొడవలి పూర్ణేంద్ర శ్రీకృష్ణ ఆదిత్య, కూర్మన్నపాలెం అశోక్‌నగర్

ఇంజినీరింగ్ నుంచి సివిల్స్ వైపు..



ఇంజినీరింగ్ విభాగంలో 41వ ర్యాంక్ వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ ర్యాంక్ సాధించగలిగాను. సిరిపురం నారాయణ బ్రాంచ్‌లో ఇంటర్ చదివాను. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదివి.. సివిల్స్ వైపు పయనం సాగించాలని ఉంది. నాన్న భాస్కర్ వర్మ డయాగ్నోస్టిక్ సెంటర్ నడుపుతున్నారు. అమ్మ రజని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.

– ముదునూరి శుభాషీష్ వర్మ, 41వ ర్యాంకర్

ఎంబీబీఎస్ చేస్తా..



ఏపీ ఈఏపీ సెట్‌లో విశాలాక్షినగర్ అమ్మాయి ఉత్తమ ర్యాంకు సాధించింది. శ్రీరామ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న పశువైద్యులు ఉడుముడి రమణరాజు, రాజేశ్వరిల కుమార్తె వెంకట రమ్య 172వ ర్యాంకు సాధించింది. నీట్‌లో కూడా ఆల్ ఇండియాలో 4,673వ ర్యాంకు వచ్చింది. మెడిసిన్‌లో చేరి వైద్య వృత్తి చేపడతానని ఈ సందర్భంగా తెలిపింది. తల్లిదండ్రులిద్దరూ పశువైద్యులని, తాను మాత్రం ఎంబీబీఎస్ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించింది. ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ర్యాంకు సాధించినట్లు తెలిపింది.

ధీరజ్‌కు 11వ ర్యాంకు



ఏపీ ఈఏపీ సెట్‌లో గాజువాకకు **చెందిన మరడాన ధీరజ్‌కుమార్ 11వ ర్యాంకు** సాధించాడు. **తెలంగాణ ఎంసెట్‌లో ధీరజ్ 6వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే.** గాజువాక**కు చెందిన విద్యార్థి** హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ **కళాశాలలో ఇంటర్మీడి**యట్ పూర్తి చేశాడు. ఇంటర్ **పరీక్ష ఫలితాల్లో 987** మార్కులు సాధించిన ధీరజ్ జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా 110వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 18వ ర్యాంకు సాధించినట్టు అతని తండ్రి రమేష్ నాయుడు తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేయాలన్నదే తన లక్ష్యమని ధీరజ్ తెలిపాడు. ధీరజ్ తండ్రి వ్యాపారి కాగా, తల్లి రాజ్యలక్ష్మి షిప్‌యార్డ్ ఆస్పత్రిలో ఫార్మాసిస్టుగా పని చేస్తున్నారు.

మెకానిక్ కుమారుడు అదరగొట్టాడు



ఏపీ ఈఏసీ సెట్ ఫలితాల్లో అజీమాబాద్‌కు చెందిన మెకానిక్ కుమారుడు అద్భుత ప్రతిభ చూపాడు. ఇంజినీరింగ్ విభాగంలో 201వ ర్యాంకు సాధించిన పీలా రత్న హర్ష ఇంటర్మీడియట్‌లో 977 మార్కులను సొంతం చేసుకున్నాడు. 'ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చేయాలన్నదే నా లక్ష్యం.. నా తల్లిదండ్రులు నన్ను ఉన్నత స్థానంలో చూడాలనుకొంటున్నారు.. వారి లక్ష్యం నెరవేర్చడం కోసం కష్టపడి చదువుతున్నా'నని హర్ష తెలిపాడు. అతడి తండ్రి పీలా వరహాభూలోక సాధారణ మెకానిక్ కాగా, తల్లి భాగ్యలక్ష్మి గృహిణి.

ఐఐటీలో సీఎస్‌ఈ చేస్తా



10వ తరగతిలో 600కి 600 మార్కులు, ఇంటర్‌లో 967 మార్కులు సాధించా. జేఈఈ మెయిన్స్‌లో 1,009 ర్యాంకు వచ్చింది. ఈఏపీ సెట్‌లో 138 మార్కులు వచ్చాయి. ఇంటర్‌లో మార్కులు తగ్గడం వల్ల ర్యాంకు పెరిగింది. ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చేస్తా.. నాన్న అల్లు శ్రీనివాసరావు ఆలిండియా రేడియోలో ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. – అల్లు వరుణ్ కౌశిక్, 187వ ర్యాంకర్, మాధవధార వుడా కాలనీ

కార్డియాలజిస్టునవుతా..



ఎయిమ్స్‌లో మెడిసిన్ చేసి కార్డియాలజిస్ట్ అవుతా. అమ్మ శ్రీదేవి భీమిలి కోర్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈఏపీ సెట్‌లో 63వ ర్యాంకు సాధించాను. నారాయణ కాలేజీలో చదివాను. నీట్‌లో 1,024 ర్యాంకు వచ్చింది. ఇంటర్ సీబీఎస్‌ఈ సిలబస్‌లో 95.6 శాతం మార్కులు సాధించా. ప్రణాళికాబద్ధంగా చదివా..

– దుల్లా శివ ఆశిష్, 63వ ర్యాంకర్, వర్మ కాంప్లెక్స్, మురళీనగర్

వైద్య వృత్తిలో కొనసాగుతా..



ఏపీ ఈఏపీసెట్‌లో 21వ ర్యాంకు వచ్చింది. నీట్‌లో 640 మార్కులు సాధించాను. ఓపెన్ కేటగిరీలో ఆంధ్రా మెడికల్ కాలేజీలో సీటు వస్తుందని భావిస్తున్నాను. మెడిసిన్ పూర్తి చేసి వైద్య వృత్తిలో కొనసాగుతా. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ర్యాంకు సాధించగలిగాను. నాన్న రైల్వే ఉద్యోగి. అమ్మ గృహిణి.

– ఎ.జ్ఞానకౌశిక్, 21వ ర్యాంకర్

ఐఐటీ ముంబయిలో చేరుతా



మా నాన్న పోర్టుటౌన్ క్రైం ఎస్ఐ ఖగేశ్వరరావు, తల్లి గృహిణి. వారి ప్రోత్సాహం, అధ్యాపకుల సహకారంతో ఏపీఈఏపీ సెట్‌లో 59వ ర్యాంకు సాధించాను. జేఈఈ మెయిన్స్‌లో 122 ర్యాంకు వచ్చింది. తెలంగాణ ఎంసెట్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించాను. జేఈఈ అడ్వాన్స్‌డ్ రాశాను. ఐఐటీ ముంబయిలో కంప్యూటర్ సైన్స్ చేస్తా.

– సనపల అనిరుధ్, 59వ ర్యాంకర్

ఐఏఎస్ అయి.. ప్రజా సేవ చేస్తా..

ఏపీ ఈఏపీ సెట్‌లో 150వ ర్యాంకు సాధించాను. అమ్మానాన్నలిద్దరూ ఉపాధ్యాయులే.. ప్రణాళికాబద్ధంగా చదవడం వల్ల మంచి ర్యాంకు సాధించగలిగాను. భవిష్యత్‌లో సివిల్స్ రాసి.. ఐఏఎస్ కావడమే నా లక్ష్యం.

– రొంగలి మోహిత్ నాయుడు, బుచ్చిరాజు పాలెం


తల్లిదండ్రులతో మోహిత్

నీట్‌లో టాప్ లేపారు

విశాఖ విద్య: జాతీయస్థాయి వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం రాత్రి విడుదలైన నీట్–2023 ఫలితాల్లో మంచి మార్కులు సాధించి టాప్ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. తద్వారా జాతీయస్థాయి ప్రతిష్టాత్మక వైద్య విద్యా సంస్థల్లో సీటు సొంతం చేసుకోబోతున్నారు. వైద్య వృత్తి చేపట్టాలన్న తమ కల నేరవేరుతున్నందుకు విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

డాక్టర్.. నా కల



మాది శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస. ఆరో తరగతి నుంచి విశాఖపట్నంలోనే చదువుతున్నాను. డాక్టర్ కావాలనేది చిన్నప్పటి నుంచి కల. అందుకే పట్టుదలతో చదివాను. 700/720 మార్కులు సాధించడం ద్వారా ఆలిండియా 293వ ర్యాంకు వచ్చింది. కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది.

– రోణంకి తరుణ్‌కుమార్

ఎయిమ్స్‌లో సీటు సాధించాలని..



మాది శ్రీకాకుళం జిల్లా టెక్కలి. అమ్మ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. చదువు కోసం నాన్నతో కలసి విశాఖలోని అల్లిపురం వచ్చాం. డాక్టర్ కావాలని, అది కూడా ఢిల్లీలోని ఎయిమ్స్‌లో సీటు సాధించాలనే పట్టుదలతో చదివాను. 700/720 మార్కులు సాధించడం ద్వారా ఆలిండియా 216వ ర్యాంకు సాధించాను. న్యూరో సర్జన్ కావడమే నా లక్ష్యం.

– సరవకోట అనిష్ కుమార్

అంకాలజీలో పరిశోధనలు చేయాలి



మాది విజయనగరం జిల్లా బొబ్బిలి మల్లంపేట. అమ్మ జెడ్పీ హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. చదువు కోసం నాన్నతో కలసి విశాఖ వచ్చి మధురానగర్‌లో ఉంటున్నాం. వైద్యురాలిని కావాలన్నదే నా కోరిక.. క్యాన్సర్ వ్యాధిలో పరిశోధనలు చేయాలనే తలంపు ఉంది. నీట్‌లో 592వ ర్యాంకు సాధించడం ద్వారా ఆ కోరిక తీరబోతున్నందుకు ఆనందంగా ఉంది.

– వంగపండు సంతోషిణి

న్యూరో సర్జన్.. నా లక్ష్యం



మాది సిరిపురం బాలాజీ నగర్. న్యూరో సర్జన్ కావాలన్నదే నా లక్ష్యం. అమ్మానాన్నల సహకారం, కాలేజీ అధ్యాపకుల ప్రోత్సాహంతో నీట్‌లో 618వ ర్యాంకు సాధించాను. చాలా సంతోషంగా ఉంది. మంచి కాలేజీలోనే సీటు వస్తుందని భావిస్తున్నాను. వైద్య కోర్సు పూర్తి చేసి.. న్యూరో సర్జన్‌గా సేవలందిస్తాను.

– నరసింహ దేవర అమూల్య

వైద్య వృత్తి ద్వారా సేవ చేస్తా..



మాది అనకాపల్లి జిల్లా గొర్లివానిపాలెం. నాన్న వ్యవసాయం చేస్తుంటాడు. అమ్మ గృహిణి. చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనేది నా కోరిక. అందుకే ఆ కోరికను నెరవేర్చుకోవాలని శ్రీ చైతన్య మెడికల్ అకాడమీలో చేరాను. 683వ ర్యాంకు సాధించాను. వైద్య వృత్తిలో స్థిరపడి సేవ చేస్తాను.

– గొర్లి నిషితాంజలి, గొర్లివానిపాలెం

గిరి బాలుర సత్తా


తల్లిదండ్రులతో ఇస్సాకు, 3,073వ ర్యాంకర్

మధురవాడ: నీట్ ఫలితాల్లో మారికవలసలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. సంస్థ నుంచి 28 మంది పరీక్షలకు హాజరు కాగా 15 మంది అర్హత సాధించడం విశేషం. ఇందులో కె.ఇస్సాకు 420 మార్కులు సాధించి ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 3,073వ ర్యాంకు సాధించాడు. గురుకులాల్లో రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం ఈదుల బయలుకు చెందిన వ్యవసాయ కూలీ సత్తిబాబు, మహేశ్వరిల కుమారుడు ఇస్సాకు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించే అవకాశాన్ని సొంతం చేసుకున్నాడు.

- చింతపల్లి మండలం పాత కిన్నెర్ల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు పి.బంగార్రాజు, నీలమ్మల కుమారుడు మత్స్యరాజు 319 మార్కులు సాధించి ఆలిండియా స్థాయి ఎస్టీ కేటగిరీలో 10,731వ ర్యాంకు కై వసం చేసుకున్నాడు.
- హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ లక్ష్మి కుమారుడు గోపాలరావు 283 మార్కులతో ఆలిండియా స్థాయిలో ఎస్టీ కేటగిరీలో 14,651వ ర్యాంకు సాధించాడు. వీరిద్దరికి ప్రభుత్వ కళాశాలలో బీడీఎస్‌లో సీటు పొందే అవకాశాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ శివప్రసాద్ చెప్పారు.


గోపాలరావు


మత్స్యరాజు

న్యూరో సర్జన్ అవుతా



వైద్య రంగంలో సేవలందించాలనే లక్ష్యంగా కుటుంబ సభ్యులు, నాన్న మహేశ్వరరావు నన్ను ప్రోత్సహించారు. సంగివలస శిశి విద్యా సంస్థలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాను. మెడిసన్‌లో 112వ ర్యాంక్ రావడానికి అధ్యాపకుల శిక్షణ దోహదపడింది. అమ్మ, అన్నయ్య నన్ను ఎంతగానో ప్రోత్సహించారు.

– జామి తోయజాక్ష, కృష్ణాపురం, పద్మనాభం మండలం

నో ప్లాస్టిక్ జోన్‌గా విశాఖ

- ప్రణాళికాబద్ధంగా అమలు
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



అల్లిపురం (విశాఖ దక్షిణం): నో ప్లాస్టిక్ జోన్‌గా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దుతామని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో వైజాగ్ క్యాంపెయిన్ జరుగుతున్న విధానాన్ని వివరించారు. ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్ అంశాలతో ఎకో వైజాగ్ ప్రచారం ప్రారంభమై తొమ్మిది రోజులు గడించిందన్నారు. అందులో భాగంగా విశాఖ నగర పరిధిలో ప్రత్యేక బృందాల ద్వారా ఇప్పటి వరకు 623 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేసి రూ.5,50,200 జరిమానా విధించామన్నారు. ఎకో జీరో పొల్యూషన్‌లో భాగంగా డోర్ టు డోర్ చెత్త సేకరణకు 10 ఎలక్ట్రిక్ ఆటోలను బీచ్‌రోడ్‌లో ఏర్పాటు చేశామన్నారు. జూలై 1 నుంచి మరో 65 ఆటోలను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు వెల్లడించారు. పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటే కార్యక్రమం మరోసారి ప్రారంభిస్తున్నామని కమిషనర్ తెలిపారు. మంగళవారం అన్ని హోటళ్ల యజమానులతో సింగిల్ ప్లాస్టిక్ వాడకాన్ని ఆపాలని మీటింగ్ పెట్టామని, మంచి స్పందన వచ్చిందన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో ప్లాస్టిక్ సంచులు, పేపర్లు కాకుండా గిరిజన మహిళలు ఆకులతో తయారు చేసే వాటిని యుసీడీ పీడీ ద్వారా సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్లాంటేషన్‌పై డ్రైవ్ నిర్వహిస్తామని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి నీడ వచ్చేలా ప్రణాళికలు చేపడుతున్నామన్నారు. శానిటేషన్ విభాగంలో 119 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగుల పిల్లలకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. 60 ఏళ్లు దాటిన ఉద్యోగుల పిల్లలకు కూడా ఉపాధి కల్పించడానికి కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

నిబంధనల ప్రకారమే దుకాణాల తొలగింపు..

జగదాంబ జంక్షన్ నుంచి వన్‌టౌన్ విక్టోరియా ఆస్పత్రి వరకు 60 అడుగుల రోడ్డు నిర్మించడానికి నిబంధనల ప్రకారమే పనులు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు.

ఊరటనిచ్చిన వాన


నగరంలో మెరుపులు



ఎండలతో అల్లాడిపోతున్న జనానికి తొలకరి వానలు పలకరించాయి. జూన్ రెండో వారం గడిచిపోతున్న తొలకరి జాడ లేక గత వారం పదిరోజులుగా జనం మలమల మాడిపోతున్నారు. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షం ప్రజలకు ఊరటనిచ్చింది. వాతావరణం చల్లగా మారడంతో నగరవాసులకు ఉక్కబోత నుంచి ఉపశమనం కలిగింది.

– ఫొటోలు, సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం



సకాలంలో విద్యా కానుక పంపిణీ

- కలెక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: విశాఖ జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో అందించేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ మల్లికార్జున, జేసీ కె.ఎస్. విశ్వనాథన్, జీవీఎంసీ సాయికాంత్ వర్మ, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం, అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పథకం, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డా.వైఎస్సార్ హెల్త్ క్లినిక్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల భవన నిర్మాణాలు, జగనన్న హౌసింగ్ ప్రోగ్రాం, వ్యవసాయం, నీటి విడుదల, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం తదితర అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజల సమస్యలను నిర్దిష్ట సమయంలోగా నాణ్యతతో పరిష్కరించడమే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లాలోని ప్రాధాన్యత పనులు, అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ సీఎంకు వివరించారు. సీపీవో శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డీవో పూర్ణిమా దేవి, జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.సూర్యారావు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ యోగా వారోత్సవాలు

సాక్షి, విశాఖపట్నం : తొమ్మిదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర పోర్టులు నౌకా, జలరవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ప్రకటించారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం పోర్టులో ఉన్న నౌకలపై విదేశీ సిబ్బందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న పోర్టులోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో యోగాసనాల కార్యక్రమం, 20న పోర్టు అధికారులు, ఉద్యోగులు, పోర్టు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చైర్మన్ వెల్లడించారు. 21న ఉదయం 6 గంటలకు అక్కయ్యపాలెం నెహ్రూ పాలెస్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు యోగా ఆయుష్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

రేపే మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ నిప్పన్, జయభేరి, సుస్వాదీప్ అగ్రో, టీజయ్ ఇండియా, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 380 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజనీర్, వేర్ హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ కేడ్, టెలి కాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమా, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించి 18–35 సంవత్సరాల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ.12,000 నుంచి రూ.20,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncr.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

బుల్లెట్ వేగంతో గమ్యం వైపు

- గంటకు 220 కి.మీ వేగంతో రాకపోకలు సాగించేలా రైల్వే లైన్లు
- విశాఖపట్నం–విజయవాడ–శంషాబాద్‌కు సెమీ హైస్పీడ్ లైన్
- విశాఖపట్నం–విజయవాడ– కర్నూలు టౌన్ వరకూ మరో మార్గం
- రెండూ కలిపి కంబైన్డ్‌గా 942 కి.మీ స్పీడ్ ట్రాక్ ఏర్పాటు
- ప్రిలిమినరీ ఇంజినీరింగ్ కమ్ ట్రాఫిక్ సర్వే(పీఈటీఎస్)కు అడుగులు


విశాఖపట్నం రైల్వే స్టేషన్

'ఎప్పుడెక్కామన్నది కాదన్నయ్యా.. బుల్లెట్ వేగంతో చేరుకున్నామా లేదా..' అనే డైలాగ్ ప్రయాణికులు చెప్పుకునేలా.. సరికొత్త ఆధునిక రైల్వే లైన్ల నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. విశాఖ నుంచి విజయవాడ మీదుగా శంషాబాద్, విశాఖ నుంచి విజయవాడ మీదుగా కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్ రైలు మార్గాలు రానున్నాయి. ఈ రెండు మార్గాలకు సంబంధించిన పీఈటీఎస్ సర్వే నిర్వహించేందుకు రైల్వే శాఖ సమాయత్తమైంది.

సాక్షి, విశాఖపట్నం : రైళ్ల వేగంలో మార్పులు మొదలయ్యాయి. ఇప్పటికే వందేభారత్ రైళ్లతో కొత్త శకానికి నాంది పలికిన భారతీయ రైల్వే శాఖ.. ఇప్పుడు అంతకు మించి అన్నట్లుగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్ని కలుపుతూ అత్యాధునిక సెమీ హై స్పీడ్ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రాక్‌ల సామర్థ్యం 110 నుంచి గరిష్ఠంగా 150 కిలో మీటర్లు. ముఖ్య నగరాల్ని కలుపుతూ గంటకు 220 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే విధంగా సెమీ హైస్పీడ్ రైల్వే లైన్‌లను ఏర్పాటు చేయనున్నారు.

మూడు రాజధానుల్ని అనుసంధానం చేస్తూ..

ఏపీ ప్రభుత్వం మూడు రాజధానుల్ని అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా.. అమరావతి శాసన రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా అభివృద్ధి కానున్నాయి. తాజాగా వస్తున్న రైల్వే లైన్లు కూడా ఈ మూడు రాజధానుల్ని అనుసంధానిస్తున్నట్లుగానే డిజైన్ చేశారు. అదేవిధంగా.. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో కీలకంగా ఉన్న శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో ఈ లైన్లు అనుసంధానం కానున్నాయి. అంటే.. శంషాబాద్ నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నం, విశాఖపట్నం నుంచి విజయవాడ మీదుగా కర్నూలు టౌన్ రైల్వే స్టేషన్ వరకూ ఈ సెమీ హైస్పీడ్ రైలు మార్గాలు రానున్నాయి. మొత్తం 942 కిలోమీటర్ల మేర.. గంటకు 220 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయేలా ట్రాక్‌లు నిర్మించనున్నారు.

5 గంటల్లో విశాఖ టూ హైదరాబాద్

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకోవాలంటే 11 నుంచి 12 గంటల సమయం పడుతుంది. కానీ.. ఈ సెమీ హైస్పీడ్ ట్రాక్ నిర్మాణం పూర్తయితే.. 4 నుంచి 5 గంటల్లో విశాఖ నుంచి హైదరాబాద్ చేరుకోవచ్చు. ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ రైళ్ల గరిష్ఠ వేగం 160 కిలోమీటర్లు అయినా.. ప్రస్తుతం 80 నుంచి 120 కి.మీ వేగంతో నడుస్తున్నాయి. భవిష్యత్తులో వందేభారత్ రైళ్లను అప్‌గ్రేడ్ చేస్తున్నారు. వందేభారత్‌లోనూ స్లీపర్ కోచ్‌లు రాబోతున్నాయి. కొత్తగా రాబోతున్న ఈ ట్రైన్లు గంటకు 200 కి.మీ వేగంతో దూసుకెళ్లేలా తయారు కాబోతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన మార్గాల్లో ఎక్కువ శాతం ఈ ట్రైన్‌లు నడపాలని రైల్వే శాఖ భావిస్తోంది. అందుకే.. ఈ సెమీ హైస్పీడ్ కారిడార్స్ ప్రాజెక్టుపై దృష్టి సారించింది.

పీఈటీఎస్‌కు టెండర్లు

ఈ రెండు కారిడార్లకు సంబంధించి ప్రిలిమినరీ ఇంజినీరింగ్ కమ్ ట్రాఫిక్ సర్వే(పీఈటీఎస్)కు రైల్వే బోర్డు టెండర్లు ఖరారు చేసింది. సింగిల్ పాకెట్‌లో ఈ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. రూ.2.70 కోట్లతో నిర్వహించనున్న ఈ సర్వేను ఆరు నెలల్లో పూర్తి చేయాలని సదరు సర్వే సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది చివరి నాటికి సర్వే పూర్తయిన వెంటనే.. ఈ సెమీ హై స్పీడ్ కారిడార్ పనులకు సంబంధించిన ప్రాథమిక అంచనా వ్యయాన్ని నిర్ధారిస్తూ.. డీపీఆర్ సిద్ధం చేయనున్నారు. డీపీఆర్ పూర్తయిన వెంటనే పనులకు టెండర్లు పిలవాలని రైల్వే శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ కారిడార్ పనులు పూర్తయితే.. ఏపీ తెలంగాణ మధ్య రవాణా మరింత సులభతరం, వేగవంతం కానుందని వాల్తేరు డివిజన్ అధికారులు భావిస్తున్నారు. విశాఖను అనుసంధానం చేస్తూ జరుగుతున్న ఈ కారిడార్‌కు రైల్వే శాఖ ప్రాధాన్యమివ్వడం శుభపరిణామంగా చెబుతున్నారు.

మహిళ మృతి కేసులో అదుపులోకి ముగ్గురు?

తగరపువలస : సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఎదురుగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళను భోగాపురం మండలం చాకివలసకు చెందిన అరసవిల్లి శ్రీలక్ష్మిగా పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 11వ తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఎదురుగా మహిళ మృతదేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈనెల 13వ తేదీన సంఘటన స్థలాన్ని నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ సందర్శించి, సీసీ కెమెరాలను పరిశీలించారు. మహిళ మృతి చెందిన రోజు రాత్రి ఆ ప్రాంతంలో తగరపువలస ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్న దివీస్ ఉద్యోగి బైక్ వెళ్లినట్లు గుర్తించారు. ఆ వాహనం నంబరుతో వివరాలు ఆరా తీసి భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ పరిసరాలలో గాలింపు చర్యలు చేపట్టారు. లా అండ్ ఆర్డర్ డీసీపీ విద్యాసాగర్‌నాయుడు, క్రైమ్ డీసీపీ నాగన్న, మధురవాడ జోన్ ఏసీపీ శివరామిరెడ్డి, భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి సిబ్బందితో కలిసి బుధవారం ఆదర్శనగర్, చిట్టివలస తదితర ప్రాంతాలలో విచారించారు. స్థానికుల సమాచారం ప్రకారం మృతురాలు లక్ష్మి ప్రతిరోజు తగరపువలస కూలిపనులకు వచ్చి వెళ్లిపోతుండేది. ఆదర్శనగర్‌కు చెందిన దివీస్ ఉద్యోగి భార్య ఊరెళ్లడంతో అతని ఇంట్లో రెండు రోజులు ఉన్నట్టు తెలిసింది. వీరిద్దరి మధ్య విభేదాలు రావడంతో హత్య చేసినట్టు సమాచారం. ఈ అత్యాచారం, హత్య సంఘటనలో ముగ్గురు నుంచి అయిదుగురు పాల్గొన్నట్టు తెలిసింది. వీరిలో ఒక ఉపాధ్యాయుడు ఉన్నట్టు ఆదర్శనగర్ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా పోలీసులు మాత్రం మృతురాలి పోస్టుమార్టం నివేదిక వస్తే తప్ప వివరాలు వెల్లడించలేమంటున్నారు. బుధవారం సాయంత్రానికి పోలీసులు ఆదర్శనగర్‌లో ఇద్దరిని, కొండపేట గోస్తనీనది దివీస్ అప్రోచ్ రోడ్డులో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.


అరసవిల్లి శ్రీలక్ష్మి

అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహించొద్దు

విశాఖ విద్య: ప్రభుత్వ అనుమతులు లేకుండా జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు నిర్వహించడానికి వీల్లేదని డీఈవో ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను పాఠశాలల్లో చేర్చేటప్పుడు తల్లిదండ్రులు ఈ విషయాన్ని పరిశీలన చేయాలన్నారు. ప్రైవేటు స్కూళ్లలో కూడా తప్పనిసరిగా ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను మాత్రమే వినియోగించాలన్నారు. జిల్లాలోని ప్రైవేటు స్కూళ్ల అవసరాల నిమిత్తం తగినన్ని పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. నగరంలోని ప్రజాశక్తి ముద్రణాలయాన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల వారు సంప్రదించాలన్నారు.

'పారదర్శకంగా వీజేఎఫ్ సభ్యత్వ నమోదు ప్రక్రియ'

మహారాణిపేట: వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం(వీజేఎఫ్) సభ్యత్వ నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని స్టాంపులు, రిజిస్ట్రేషన్ డీఐజీ బాలకృష్ణ తెలిపారు. వీజేఎఫ్‌కు సంబంధించి కలెక్టర్ నియమించిన కమిటీ సభ్యులతో బుధవారం ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జర్నలిస్టుల సభ్యత్వాల పరిశీలన, కొత్త సభ్యుల నమోదు ప్రక్రియ, అభ్యంతరాల స్వీకరణ, తదుపరి చేపట్టాల్సిన అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు దరఖాస్తులు ఐ అండ్ పీఆర్ కార్యాలయంలో లభిస్తాయని, వీజేఎఫ్ కాన్ఫరెన్స్ హాలులో కమిటీ సభ్యులకు మాత్రమే దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణపత్రాలు జత చేయాలని సూచించారు.

వయోవృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

మహారాణిపేట : ఆస్పత్రులు, పోలీసు స్టేషన్లలో వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో సీనియర్ సిటిజెన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వయో వృద్ధులకు సంబంధించి పలు అంశాలు చర్చించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, ఎన్‌జీవో సభ్యులు టీవీఎస్ రావు, సీహెచ్ వెంకటరావు, కె.మంగపతి, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి పాల్గొన్నారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు.

ఆర్అండ్‌బీ ఎస్ఈగా కాంతిమతి

సాక్షి, విశాఖపట్నం: రోడ్లు భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్(ఎస్ఈ)గా కె.కాంతిమతి నియమితులయ్యారు. ఆమె శ్రీకాకుళం ఎస్ఈగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఉమ్మడి విశాఖ జిల్లాకు ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న జాన్ సుధాకర్ శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఆయన విధుల నుంచి రిలీవ్ అవ్వడంతో ఆ స్థానంలో కాంతిమతి బాధ్యతలు చేపట్టారు.

నీట్‌లో శశి విద్యార్థులకు ర్యాంకులు


రవీంద్ర కృష్ణ చైతన్య హర్షవర్ధన్ హర్షిత్

తగరపువలస: నీట్–2023 ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని సంగివలస శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. 720 మార్కులకు గానూ 697 మార్కులతో ఓబీసీ కేటగిరీలో బి.రవీంద్ర ఆలిండియాలో 71వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 351 ర్యాంకు సాధించినట్లు చెప్పారు. బి.కృష్ణ చైతన్య 695 మార్కులతో ఓబీసీ కేటగిరీలో ఆలిండియాలో 114, ఓపెన్ కేటగిరీలో 529, సీహెచ్ హర్షవర్ధన్ ఓబీసీ కేటగిరీలో 384, ఓపెన్ కేటగిరీలో 573, కె.హర్షిత్ ఓబీసీ కేటగిరీలో 537, ఓపెన్ కేటగిరీలో 1912, జె.తోయజాక్ష ఓబీసీ కేటగిరీలో 559, ఓపెన్ కేటగిరీలో 1956 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

ఏపీ ఈఏపీ సెట్‌లో..


నారాయణ అభిరామ్ నాగవంశీ

శశి విద్యార్థులు ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో సత్తా చాటారు. ఇంజినీరింగ్ విభాగంలో రౌతు సాయి నారాయణ 261వ ర్యాంకు, కుందేరపు అభిరామ్ 278, రాయపాటి నాగవంశీ 315, బలివాడ కావ్య 353, దమ్ము వీర వెంకట చైతన్య పవన్ కుమార్ 411, పారేపల్లి సాయిరామ్ 419, వద్దాది శ్రీ సూర్య గణవంత్ 446, దాసరి ప్రణతి 493వ ర్యాంకు సాధించారు. అగ్రి మెడిసిన్ విభాగంలో చింతోడు హర్ష సత్యవర్ధన్ 61, కల్యంపూడి హర్షిత 71, బొద్దేపల్లి రవీంద్ర 89, పైల కృష్ణ చైతన్య 110, జామి తోయజాక్ష 112, బొడ్డు శ్రీదేవి 616, గంటా భువనేశ్వరి 664, పట్టా జయశ్రీ 768వ ర్యాంకు సాధించినట్టు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు.

నారాయణ ప్రభంజనం


నిహారిక, 51వ ర్యాంకర్

సీతమ్మధార: నీట్–2023 ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు మరోసారి విజయకేతనం ఎగురవేసినట్లు సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ రామలింగేశ్వరరావు తెలిపారు. ఆశీలమెట్టలోని సంస్థ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. ఆల్ ఇండియా స్థాయిలో ముద్రు నిహారిక నాయుడు 51వ ర్యాంకు, అన్నెపు రవితేజ 79, డి.శివ ఆశిష్ 257, నీలపాటి కీర్తన అయ్యన్ 368, నగిరెడ్డి హర్షవర్ధన్ 659, చప్పా జహిత 679, కొండపల్లి లోకనాథ్ అభిషేక్ 741, తంగుడు శ్రీ కీర్తి 747, సూర్ర లోక చందులాల్ దొర 797వ ర్యాంక్ సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వారు అభినందనలు తెలిపారు.

ఏపీఈఏపీ సెట్‌లో..

ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు డీజీఎం హనుమంతురావు, డీన్ జి.రామలింగేశ్వరరావు తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగంలో ఎం.వి.వి. హర్షవర్ధన్ 29వ ర్యాంక్, ఎం.సుభాషిస్ వర్మ 41, అనన్య లచ్చుపత్తుల 50, డి.శివ ఆశిష్ 63, హనుమత్ నితిన్ 95, పెద్దింటి శ్రీ బాలాజీ 96వ ర్యాంక్ సాధించారు. వెయ్యి లోపు 50 ర్యాంకులు సాధించి ఉత్తరాంధ్రలోనే మరోసారి నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వారు అభినందనలు తెలిపారు.



విద్యార్థులతో నారాయణ విద్యా సంస్థ ప్రతినిధులు

నేడు నగరంలో అరుణ్ బరోకా పర్యటన

సీతమ్మధార : కెమికల్స్, అండ్ పెట్రో కెమికల్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరుణ్ బరోకా విశాఖ చేరుకున్నారు. గురువారం ఉదయం పెట్రో కెమికల్ కారిడర్ పరిధిలో జరుగుతున్న వివిధ పనులను, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పరిశీలించనున్నారు. అదే విధంగా కెమికల్ పార్కు ఏర్పాటు చేయడంలో ఉన్న సాధ్యాసాధ్యాలను అధికారులతో కలిసి చర్చించనున్నారు. జూలై చివరి వారంలో నిర్వహించనున్న అంతర్జాతీయ కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ తయారీ హబ్ ఈవెంట్ ప్రమోషన్‌లో పాల్గొనున్నారు.

సత్తా చాటిన శ్రీచైతన్య

విశాఖ విద్య: ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య ఉత్తరాంధ్ర విద్యా సంస్థల విద్యార్థులు సత్తా చాటారని శ్రీ చైతన్య సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎస్.సిద్ధార్థ 13వ ర్యాంకు, బి.సంజన 20, ఎం. ప్రణతి శ్రీజ 22, ఎస్.అనిరుధ్ 59, కె.పి.కృష్ణ ఆదిత్య 66, డి.సాకేత్ నాయుడు 68, వై.లావణ్య వాణి 80, డి. సూర్య సాయి 83, ఎం.అవినాష్ కుమార్ 91, వి.శ్రీకర్ నిహాల్ 93, బి. ధనుష్ సాయి 97వ ర్యాంకు సాధించి తమ ఘనత చాటారన్నారు. ఇంజినీరింగ్‌లో 100లోపు 11, 500 లోపు 46, 1000లోపు 89 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. మెడికల్ విభాగంలో వరుణ్ చక్రవర్తి 2వ ర్యాంకు, పి.ఆశిష్ 9, ఆర్. తరుణ్‌కుమార్ 15, ఎస్. అనిష్ కుమార్ 18, ఎ.జ్ఞాన కౌశిక్ 21, కె.నిషిత ఆత్రేయ 54 ,యు.నిఖిత శ్రీ 90, బి.విశ్లేష రెడ్డి 97వ ర్యాంక్ సాధించినట్లు వెల్లడించారు. మెడికల్‌లో 10 లోపు 2, 100లోపు 8, 500 లోపు 59 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సత్కరించారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో నిర్వాహకులు

నీట్‌లో విజయకేతనం

నీట్–2023 ఫలితాల్లో శ్రీ చైతన్య ఉత్తరాంధ్ర విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారని సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి. రమణ తెలిపారు. విశాఖపట్నం బ్రాంచి పరిధిలో సరవకోట అనిష్ కుమార్(216వ ర్యాంకు), రోణంకి తరుణ్ కుమార్(293), వంగపండు సంతోషిణి(592), నరసింహదేవర అమూల్య (618), గొర్లి నిషితాంజలి(683) తదితరులు ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. విశాఖపట్నం శ్రీ చైతన్య మెడికల్ అకాడమీకి చెందిన 469 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించినట్లు వెల్లడించారు. నగరంలోని ప్రధాన క్యాంపస్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు.

ఎసెంట్ విద్యార్థుల హవా


వెంకట సాయి రాహుల్

మద్దిలపాలెం: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థుల తమ హవాను కొనసాగించారు. కళాశాల విద్యార్థి బొడ్డేపల్లి రాహుల్ 283వ ర్యాంక్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. తమ విద్యార్థులు వరసగా 355, 366, 512, 560, 566 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. సుమారు 400 మంది విద్యార్థులు ఏపీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించారని వివరించారు.

నీట్‌లో మెరిసిన ఎసెంట్

నీట్ ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థులు మెరిశారు. కళాశాల విద్యార్థి జి.వెంకట సాయి చరణ్ 635 మార్కులు సాధించినట్లు డైరెక్టర్ ఎం.వి.ఆర్.మురళీకృష్ణ తెలిపారు. ఒకే క్యాంపస్ నుంచి నీట్ రాసిన 225 మందిలో 100 మంది సీట్లు సాధించారని వెల్లడించారు. ర్యాంకుల సాధనకు కృషి చేసిన కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు.

ఏపీ ఈఏపీ సెట్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ


వెంకటేష్ సూర్యచరణ్ ఎస్.అశోక్

పాయకరావుపేట : ఏపీ ఈఏపీ సెట్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మంచి ర్యాంక్‌లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్. భానుమూర్తి బుధవారం తెలిపారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో యు.వెంకటేష్ 497 ర్యాంకు, ఇంజినీరింగ్ విభాగంలో ఎస్.సూర్యచరణ్ 767 ర్యాంక్, ఎస్.అశోక్ 1258 ర్యాంక్ సాధించారని ఆయన తెలిపారు. 10,000 లోపు ర్యాంక్‌లు 23 మంది విద్యార్థులు సాధించినట్టు చెప్పారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్.వి.కె. నరసింహరావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తదితరులు అభినందించారు.

జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఉపయోగం

- సీపీఐ నేత, కార్పొరేటర్ స్టాలిన్ ప్రశంస

గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉందని జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎ.జె.స్టాలిన్ అన్నారు. చినగంట్యాడ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. జగనన్న విద్యా కానుక కిట్లలో యూనిఫాం, స్కూల్ బ్యాగ్, బుక్స్, షూస్, బెల్ట్, సాక్స్‌లు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శైలజ, స్థానిక నాయకుడు జి.ఆనంద్ పాల్గొన్నారు.


చినగంట్యాడ ప్రాథమిక పాఠశాలలో కిట్లను అందజేస్తున్న స్టాలిన్